సాక్షి పెద్దపల్లి

శనివారం । 30 । నవంబర్ । 2024



పత్తి క్వింటాల్‌కు రూ.7,136

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌యార్డులో శుక్రవారం పత్తి క్వింటాల్ గరిష్ట ధర రూ.7,136, కనిష్టం రూ.6,276, సరాసరి ధర రూ.6,977 నమోదయింది.



దీపోత్సవం

జ్యోతినగర్: కార్తీకమాసం సందర్భంగా శుక్రవారం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని శివాలయంలో అర్చకుడు వామనశర్మ ఆధ్వర్యంలో భక్తులు దీపోత్సవం నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం
29.0/20.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. సాయంత్రం చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

సీఎం సభ జయప్రదం చేయాలి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్/ఎలిగేడు: పెద్దపల్లిలో డిసెంబర్ 4న జరిగే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పిలుపునిచ్చారు. సుల్తానాబాద్ మండల కేంద్రంతోపాటు ఎలిగేడు మండలం శివపల్లిలోని తన నివాసంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 50 వేల మంది కార్యకర్తలు, నాయకులు, రైతులను తరలించాలన్నారు. సమావేశాల్లో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, వైస్ చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

మెనూ పాటించాలి



విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తున్న జిల్లా సంక్షేమాధికారి వేణుగోపాల్‌రావు

పాలకుర్తి(రామగుండం): ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని జిల్లా సంక్షేమాధికారి వేణుగోపాల్‌రావు ఆదేశించారు. శుక్రవారం ఉదయం మండలంలోని జయ్యారం ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తిని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆహార పదార్థాల నాణ్యత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని వార్డెన్ సంపత్‌కుమార్‌కు సూచించారు గ్రామపంచాయతీ కార్యదర్శి సాయిచరణ్, వసతిగృహ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీపీవో వీరబుచ్చయ్య, అధికారులు

ధర్మారం(ధర్మపురి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి డీపీవో, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ భోజనం చేశారు. పంచాయితీ కార్యదర్శి రవి, ఆదర్శ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రదీప్‌కుమార్, ఎస్‌వో విజయలక్ష్మి పాల్గొన్నారు.

రామగిరి ఖిలా సందర్శన



ఖిలాపై అధికారులు, నాయకులు

రామగిరి(మంథని): మండలంలోని రామగిరి ఖిలాను శుక్రవారం దేవాదాయ శాఖ అసిస్టెంట్ ఇంజినీరు సంతోష్‌రెడ్డి సందర్శించారు. ఖిలా అభివృద్ధికి ఇటీవల రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రూ.5 కోట్లు మంజూరు చేయగా, మంత్రి ఆదేశాల మేరకు ఖిలాను సందర్శించారు. నాలుగు కిలోమీటర్లు కాలినడక వెళ్లి సర్వే చేశారు. వారి వెంట మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, ఆలయ పూజారి సత్యనారాయణచార్యులు, శ్రీనివాస్, అవినాష్ తదితరులున్నారు.

మినీ పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేస్తాం

రామగుండం: అంతర్గాం మండలం ముర్మూర్‌లో మినీ పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటుకు పరిశీలన చేస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం గ్రామంలో 129 పశువులకు నట్టల నివారణ మందులు, కృత్రిమ గర్భధారణ యోగ్యం అయినవాటికి వీర్యదానం చేశారు. గ్రామంలో నిరుపయోగంగా ఉన్న కమ్యూనిటీ హాల్‌ను పాల శీతలీకరణ కేంద్ర స్థాపన సాధ్యాసాధ్యాలపై విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్‌తో కలిసి పరిశీలించేందుకు చర్యలు చేపడతానని పేర్కొన్నారు. విసంపేట, పెద్దంపేటలో పాల ఉత్పత్తి సహకార సంఘాల ఏర్పాటుకు హామీ ఇచ్చారు. వెటర్నరీ డాక్టర్ ప్రసాద్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సన్నాలు వస్తలే..!

- బహిరంగ మార్కెట్‌లో సన్నరకం ధాన్యానికి ఫుల్ డిమాండ్
- ప్రభుత్వం బోనస్ రూ.500 ఇస్తున్నా..
- కొనుగోలు కేంద్రాల్లో అమ్మేందుకు రైతుల నిరాసక్తత
- ప్రైవేట్ వ్యాపారులకే మొగ్గుచూపుతున్న అన్నదాతలు



రాఘవాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రం

సాక్షి, పెద్దపల్లి: సన్న రకం ధాన్యానికి బోనస్ ప్రకటించినా రైతులు ప్రైవేట్ వ్యాపారులకే విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. సన్నాల కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినా పెద్దగా రావడం లేదు. గతంలో వలె కేంద్రాల్లో తూకంలో కోత లేకపోయినా, 48 గంటల్లోనే డబ్బులు జమవుతున్నా అధికారులు ఆశించిన మేర సన్నరకం ధాన్యం కేంద్రాలకు రావడం లేదు. ఇప్పటి వరకు 11,585 మంది రైతుల నుంచి 1,04,385 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం కొనుగోలు చేయగా, వారిలో 6 వేల మంది రైతులకు రూ.22.32కోట్ల బోనస్ చెల్లించారు.

సన్నాల్లో 33 రకాలు

జిల్లాలో వానాకాలంలో 2.80లక్షల ఎకరాల్లో వరి సాగవగా, 4లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. వాటిలో సన్నరకం 3.57లక్షల టన్నుల దిగుబడి వస్తుందని భావించారు. జనవరి నుంచి రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తుంది. దొడ్డు రకంలో గ్రేడ్ ఏ కు రూ.2,320, కామన్ రకానికి రూ.2,300 ఇవ్వనుంది. ప్రభుత్వం గుర్తించిన 33 సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తామని ప్రకటించింది. బోనస్ నేపథ్యంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వడ్లు వస్తాయని అధికారులు అంచనా వేశారు. వాటి కోసం ప్రత్యేకంగా 42 సెంటర్లు ఓపెన్ చేశారు. సన్నాలకు బహిరంగ మార్కెట్‌లో అధికంగా డిమాండ్ ఉంది. క్వింటాల్ బియ్యానికి రూ.5వేల నుంచి రూ.6వేల వరకు రేటు పలుకుతోంది. అందుకే మరాడించి అమ్మాలని సన్నాలు పండించిన రైతులు ఆలోచిస్తున్నారు. మరికొందరు నేరుగా కల్లాల వద్దే వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ప్రైవేటులో కొందరు వ్యాపారులు, మిల్లర్లు రూ.2,600 నుంచి రూ.2,700 పైగా ధర పెడుతున్నారు. దీంతో రైతులు అటువైపే మొగ్గుచూపుతున్నారు. ఈక్రమంలో అధికారులు అంచనాలు తలకిందులయ్యాయి.

జిల్లాలో కొనుగోళ్లు ఇలా..

మొత్తం కేంద్రాలు	329
సన్నాల కొనుగోలు కేంద్రాలు	42
కొనుగోలు చేసిన ధాన్యం	1,52,203మె.ట
విక్రయించిన రైతులు	24,365
కొనుగోలు చేసిన దొడ్డురకం	47,817మె.ట
కొనుగోలు చేసిన సన్నరకం	1,04,385మె.ట
చెల్లించాల్సిన బోనస్	రూ.41.15కోట్లు
చెల్లించిన బోనస్	రూ.22.32కోట్లు

ఎదురుచూపులు ఎందుకుని..

కేంద్రాలకు వెళ్తే ధాన్యం తేమ, నాణ్యత పరీక్షించి అన్ని అనుకూలంగా ఉంటేనే కొనుగోలు చేస్తారు. అంతేకాదు కేంద్రాలకు తీసుకొచ్చి ఆరబోసి, తూకాల కోసం ఎదురుచూడటం కన్నా రూ.100 తక్కువైనా ప్రైవేట్‌కు విక్రయించటం మేలని రైతులు భావిస్తున్నారు. మరోవైపు బియ్యం వ్యాపారం చేసే వారంతా సన్నారకాలనే కొనుగోలు చేస్తూ ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. కొందరు స్థానికంగా మిల్లింగ్ చేయించి బియ్యం అమ్ముతున్నారు. ధరలు పెరుగుతుండటం, ఇతర ప్రాంతాల్లో డిమాండ్ ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంది.

కోత పెట్టలేదు



ఎకరం పొలంలో సన్న రకాలు సాగు చేశా. 22 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మా ఊరి కొనుగోలు కేంద్రంలో విక్రయించా. మద్దతు ధరతో పాటు రూ.11,000 బోనస్ రెండురోజుల్లోనే జమయింది. ఈసారి కోతలు లేకుండా పైసలు తొందరగా పడ్డాయి.

– గద్దల రాజయ్య, బ్రాహ్మణపల్లి

రూ.71వేల బోనస్ పడింది



కౌలు తీసుకొని ఐదెకరాల్లో సన్నరకాల సాగు చేశా. 142 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మద్దతు ధరతో పాటు రూ.71 వేల బోనస్ ఖాతాల్లో జమైంది. ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ప్రకటించడంతో బహిరంగ మార్కెట్‌లో సైతం డిమాండ్ పెరిగి పోటీపడి వ్యాపారులు కొంటున్నారు. దీంతో రైతులకు మేలు జరుగుతుంది.

– బిల్లా వెంకటేశ్, శాలపల్లి

త్వరితగతిన చెల్లింపులు



ప్రభుత్వం సన్న ధాన్యానికి క్వింటాలుకు ఇచ్చే రూ.500 బోనస్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే విక్రయించిన వారి ఖాతాల్లో సుమారు రూ.22.32కోట్ల బోనస్ జమ చేశాం. డబ్బులు వెనువెంటనే రైతుల ఖాతాల్లో జమచేస్తున్నాం.

– శ్రీకాంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్

సీఎం పర్యటనకు పటిష్ట భద్రత

- కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం సీపీ శ్రీనివాస్



సభావేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, సీపీ శ్రీనివాస్, అధికారులు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలో డిసెంబర్ 4న నిర్వహించే సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. సీఎం పర్యటన కోసం అవసరమైన సభావేదిక, పార్కింగ్ స్థలాలను శుక్రవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం సీపీ శ్రీనివాస్ పరిశీలించారు. సీఎం పర్యటనకు పటిష్ట భద్రత కల్పించేలా పక్కా చర్యలు ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సభలో గ్రూప్–4, ఇతర ఉద్యోగాలకు ఎంపికైన 9వేల మంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఆర్డీవో గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఈఈ భావ్‌సింగ్, గిరీశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రిలో ఫిజియోథెరపీ సేవలు

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వాసుపత్రి ఆవరణలో వయోవృద్ధుల కోసం ఫిజియోథెరపీ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. శుక్రవారం కేంద్రాన్ని పరిశీలించారు. ఆపరేషన్ జరిగినవారికి నడుంనొప్పి, మెడనొప్పి, దీర్ఘకాలిక నొప్పులు, వెన్నెపూస సమస్యలు ఉన్నవారు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. ఆర్ఎంవో రవీందర్ తదితరులున్నారు.

హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలి

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు పొందేందుకు వచ్చే వారికి అవసరమైన సమాచారం అందించేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్, ఓపీ రిజిస్ట్రేషన్, కంటి ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, జనరల్ వార్డులను శుక్రవారం పరిశీలించారు. ఆసుపత్రి ప్రవేశద్వారం వద్ద హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు.

డిసెంబర్ 2 నుంచి 'టాస్క్' శిక్షణ

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలో (బస్టాండ్ పక్కన ఎంపీడీవో ఆఫీసు వెనక) ఏర్పాటు చేసిన టాస్క్ శిక్షణ కేంద్రంలో డిసెంబర్ 2 నుంచి తొలిబ్యాచ్ విద్యార్థులకు 10రోజుల శిక్షణ మొదలవుతుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. డిగ్రీ, బీటెక్ చదివినవారు టాస్క్ సెంటర్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని రీజినల్ హెడ్ నవీన్‌రెడ్డి పేర్కొన్నారు. 10 రోజుల పాటు సాఫ్ట్ స్కిల్స్, ప్రోగ్రామింగ్ స్కిల్స్‌పై శిక్షణ పూర్తి చేసిన తర్వాత ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సహకరిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 91821 17078, 93951 13738 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కల.. నెరవేరుతున్న వేళ

- గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు ప్రారంభం
- సేకరించిన భూముల స్వాధీనం
- జిల్లాలో 85 శాతానికి పైగా పరిహారం చెల్లింపు
- అదనపు పరిహారం కోసం దరఖాస్తులు



మంథని మండలం కన్నాల పరిధిలో ప్రారంభమైన మట్టి తొలగింపు పనులు

మంథని: నాగ్‌పూర్– విజయవాడ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే (ఎన్‌హెచ్–163)లో భాగంగా మంచిర్యాల–వరంగల్ మధ్య మొదటి ప్యాకేజీలో చేపట్టే జాతీయ రహదారి నిర్మాణ పనులు ఎట్టకేలకు జిల్లాలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. గతేడాది జూలైలో హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ప్రధాని మోదీ పనులకు శంకుస్థాపన చేయగా, భూసేకరణ సమస్యతో పనులు ఆలస్యమయ్యాయి. ఈ క్రమంలో మంథని మండలం కన్నాల గ్రామ పంచాయతీ పరిధి పందులపల్లిలో పనులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో జాతీయ రహదారి కల నెరవెరబోతుంది.

భూసేకరణకు తొలగిన అడ్డంకులు

రహదారి నిర్మాణంలో సేకరించిన భూములను స్వాధీనం చేసుకునేందుకు పంటలసాగు ఇంతకాలం అడ్డువచ్చింది. వరికోతల సమయం కావడంతో సేకరించిన భూముల్లో కోతలు పూర్తికాగానే వెనువెంటనే నేషనల్ హైవే అథారిటీ అధికారులు భూములు స్వాధీనం చేసుకుని కంచె ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

85 శాతానికి పైగా చెల్లింపులు

ప్యాకేజీ–7 కింద మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం వేలాల నుంచి ప్రారంభమయ్యే నాల్గు లైన్ల జాతీయ రహదారి పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఉప్పట్ల గోదావరి సమీపం నుంచి పోతారం, విలోచవరం, నాగారం, కన్నాల, పందుపపల్లి, పుట్టపాక, రామగిరి మండలం ఆదివారంపేట, బేగంపేట, నవాబ్‌పేట, ముత్తారం మండలం లక్కారం, కేశన్‌పల్లి, ముత్తారం, అడవి శ్రీరాంపూర్ ఓడేడు మీదుగా (సుమారు 40 కిలోమీటర్లు) వరంగల్ వెళ్తోంది. రహదారికి 199.7358 హెక్టార్ల (సుమారు 500 ఎకరాలు) భూమి అవసరమవుతుందని హైవే అథారిటీ సూచించింది. రహదారిలో కోల్పోతున్న భూములు ఎకరాకు రూ.50 లక్షల నుంచి రూ. 60 లక్షల మార్కెట్ ధర పలుకుతుంది. కానీ అధికారులు కేవలం రూ.4.50 లక్షల నుంచి రూ.6లక్షల మేర పరిహారం చెల్లిస్తున్నారు. జిల్లా పరిధిలో 1,400 పైగా మంది రైతులకు పరిహారం కింద రూ.25 కోట్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 50 పైగా మంది రైతులకు రూ.2 కోట్ల మేర చెల్లింపులు జరిగాయి. కాగా జాతీయ రహదారిలో భూములు కోల్పోతున్న రైతులకు చెల్లించే పరిహారం మార్కెట్ ధరతో పోల్చితే తక్కువ వస్తుండడంతో అదనపు పరిహారం కోసం జిల్లా కలెక్టర్ (ఆర్బిట్రేటర్ ట్రిబ్యునల్)కు అప్పీలు అవకాశం కల్పించారు.

బోరుబావుల పరిహారంపై పేచి

రహదారి నిర్మాణంలో కోల్పోతున్న భూములతో పాటు బోరుబావులు ఇతర వాటికి పరిహారం చెల్లించాల్సి ఉంది. కానీ అధికారులు కేవలం భూములకు మాత్రమే పరిహారం చెల్లిస్తున్నారు. మిగతా వాటి ప్రస్తావన లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే భూసేకరణలో అనేక తప్పులు దొర్లినట్లు రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి.

ట్రెంచ్ కటింగ్ పనులు ప్రారంభం

పెద్దపల్లిరూరల్/మంథని: జిల్లా మీదుగా వెళ్తున్న వరంగల్–మంచిర్యాల జాతీయ రహదారి పనుల్లో భాగంగా శుక్రవారం మంథని మండలం కన్నాల, కందులపల్లిలో ట్రెంచ్ కటింగ్ పనులు మొదలయ్యాయని కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. హైవే కోసం సేకరించిన భూమిని అథారిటీకి అప్పగించామని పేర్కొన్నారు.

కేసీఆర్ హీరో.. రేవంత్ జీరో



దీక్షా దివస్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

- తెలంగాణ చరిత్రలో లిఖించబడిన రోజు దీక్షా దివస్
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

సాక్షి, పెద్దపల్లి: తెలంగాణ ఉద్యమ చరిత్రలో కేసీఆర్ హీరో అయితే.. రేవంత్‌రెడ్డి జీరో అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ తొలి సీఎం కేసీఆర్‌కు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి మధ్య నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని ఎద్దేవా చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, పుట్ట మధుకర్, దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో దీక్షా దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పుల హాజరై మాట్లాడారు. 2009 నవంబర్ 29 దీక్షా దివస్ తెలంగాణ రావడానికి కారణమైతే, నేటి దీక్షా దివస్ రానున్న కాలంలో కాంగ్రెస్ పార్టీని గద్దె దింపి తిరిగి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ సైనికులు మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సుదీర్ఘ ఉద్యమ చరిత్ర కలిగిన బీఆర్ఎస్ మొక్క నుంచి అతి పెద్ద వృక్షంగా మారి తెలంగాణ వ్యాప్తంగా వేర్లతో అల్లుకొని పోయిందన్నారు. అలాంటి పార్టీ నేత కేసీఆర్ పేరును చెరిపివేయడం రేవంత్‌రెడ్డి తరం కాదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేసేందుకు డిసెంబర్ 1నుంచి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతామని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో నాయకులు లేరు.. అందరూ ఉద్యమకారులేనని వెల్లడించారు.

వ్యతిరేకత మొదలైంది: కోరుకంటి

11 నెలల్లోనే కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. దానిని క్షేత్ర స్థాయిలో తీసుకువెళ్లి ప్రజలను చైతన్యం చేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్క బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తపై ఉందని పేర్కొన్నారు.

బంగారు తెలంగాణ కోసం.. : దాసరి

బంగారు తెలంగాణ కోసం అడుగులు పడుతున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చి ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. తిరిగి బంగారు తెలంగాణలో భాగస్వాములు కావాలంటే బీఆర్ఎస్ పార్టీనే గెలిపించాలని పేర్కొన్నారు.

రాజ్యాంగానికి తూట్లు పొడిచిన కాంగ్రెస్: పుట్ట మధు

కాంగ్రెస్ లేకుంటేనే దేశం బాగు పడుతుంది. నెహ్రూ, ఇందిరా, రాజీవ్ గాంధీల నుంచి మొదలు కొని రాజ్యాంగాన్ని తూట్లు పొడిచి ఇప్పుడు రాహుల్‌గాంధీ రాజ్యాంగాన్ని పట్టుకొని తిరుగుతున్నాడని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మూల విజయారెడ్డి, రఘువీర్‌సింగ్, గంట రాములు, మురళీధర్‌రావు, గోపు ఐలయ్యాయాదవ్, తగరం శంకర్‌లాల్, ఎక్కేటి అనంతరెడ్డి, ఉప్పు రాజ్‌కుమార్, పూదరి చంద్రశేఖర్, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శుచి, శుభ్రత పాటిస్తూ వంట చేయాలి

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్



సాంబార్ రుచి చూస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్

రామగుండం: పరిశుభ్రమైన వాతావరణంలో శుచి, శుభ్రత పాటిస్తూ వంట చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ సూచించారు. శుక్రవారం అంతర్గాం మండలం ఎల్లంపల్లి కేజీబీవీని ఆకస్మికంగా సందర్శించారు. వంటగది, వంట పాత్రల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థుల భోజనానికి సిద్ధం చేసిన సాంబార్‌ను రుచి చూశారు. అనంతరం వాష్‌రూమ్ కాంప్లెక్స్‌లను పరిశీలించారు. వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనంలో నాణ్యత లోపిస్తే నేరుగా తనకు సమాచారం అందించాలని విద్యార్థులకు భరోసా కల్పించారు.

సన్నాల సాగును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

సన్నాల సాగును ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తూ రైతులకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌ఠాకూర్ పేర్కొన్నారు. శుక్రవారం అంతర్గాం మండలం గోలివాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి మొలకెత్తితే వేరుగా నిల్వ చేయాలని, తడిసిన ధాన్యాన్ని మిల్లర్లతో మాట్లాడి రైతులకు నష్టం జరగకుండా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ సకాలంలో వరి నాట్లు వేసుకుంటే నాణ్యమైన దిగుబడులు పొందే వీలుంటుందన్నారు. రైతుల వద్ద ఉన్న చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని భరోసా కల్పించారు. అనంతరం ధాన్యం తూకం వేసి కొనుగోళ్లు ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ మామిడాల కరుణాకర్, ఎంపీడీవో ఎంఏ అలీం తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

రామగిరి(మంథని): మంథని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో డిసెంబర్ 6,7వ తేదీల్లో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో ఆర్టో రోబోటిక్స్‌పై జాతీయ స్థాయి వర్క్ షాపు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. వర్క్‌షాపునకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం కళాశాలలో ఆవిష్కరించారు. రెండు రోజుల పాటు నిర్వహించే వర్క్‌షాపులో రిజిస్ట్రేషన్ చేయించుకున్న విద్యార్థులకు వారణాసి ఐఐటీ వారితో సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. అర్డినో బోర్డు సహాయంతో ఏడు కరకాల రోబోట్స్ తయారు చేయడం నేర్పిస్తారని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫ్యాకల్టీ సలహాదారు స్వప్న, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ లోకేశ్, శ్రీనాథ్, లావణ్య, సంగీత, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు రైతుపండుగ సంబురాలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని రైతు వేదికల వద్ద శనివారం ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే రైతుపండుగ సంబరాల్లో అన్నదాతలు పాల్గొని విజయవంతం చేయాలని డీఏవో ఆదిరెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 14 రైతువేదికలకు సమీప గ్రామాల రైతులు హాజరుకావాలన్నారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం ఉంటుందని రైతులందరూ వీక్షించాలని కోరారు.

క్లుప్తంగా

షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం



ఓదెల(పెద్దపల్లి): మండలంలోని మడక గ్రామానికి చెందిన మ్యాక మధునయ్య ఇంట్లో శుక్రవారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. పొత్కపల్లి ఎస్సై అశోక్ రెడ్డి కథనం ప్రకారం.. మధునయ్య ఊరికిపోయిన సమయంలో ఇంటినుంచి మంటలతో కూడిన పొగలు బయటకు వచ్చాయి. ఇరుగు పొరుగు వారు గమనించి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. జమ్మికుంటకు చెందిన అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో బట్టలు, ఇతర సామగ్రి కాలిపోయాయి. సుమారు రూ.50వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి శివారులోని రాజీవ్ రహదారిపై గురువారం రాత్రి లారీ బోల్తా పడగా డ్రైవర్ యోగేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. వరంగల్ నుంచి నాగ్‌పూర్‌కు మిర్చి లోడ్‌తో వెళ్తుండగా ప్రమాదవశాస్తు డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. గాయపడిన డ్రైవర్‌ను బ్లూకోల్ట్స్ సిబ్బంది 108లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

నేతకార్మికుని హఠాన్మరణం



సత్తయ్య(ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని పల్లిమక్తకు చెందిన నేత కార్మికుడు వాసం సత్తయ్య (55) గుండెపోటుతో మృతిచెందాడు. సత్తయ్య కొన్నేళ్ల క్రితం పవర్‌లూం కార్మికునిగా పనిచేశాడు. కొద్ది రోజులుగా ఇంటివద్దే ఉంటున్నాడు. శుక్రవారం గ్రామంలో జరిగే ఓ వేడుకకు హాజరయ్యేందుకు వెళ్తుండగా గుండెపోటుకు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే సిరిసిల్లకు తరలించారు. కాగా అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య తులసవ్వ, కూతురు మమత ఉన్నారు.

అప్పలబాధతో యువకుని ఆత్మహత్య



కోనరావుపేట(వేములవాడ): అప్పుల బాధలు భరించలేక ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలం నాగారం గ్రామానికి చెందిన దూస సత్యనారాయణ-కవిత దంపతుల కుమారుడు వెంకటేశ్(34) గల్ఫ్‌కు వెళ్లగా అక్కడా సరైన పనిలేక తిరిగొచ్చాడు. దీంతో అప్పులు పెరిగిపోయాయి. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుండగా సరైన పని దొరక్క మరిన్నీ అప్పులై సుమారు రూ.8లక్షలకు చేరాయి. వీటిని తీర్చే మార్గంలేక మనస్థాపానికి గురై వారం క్రితం బంధువులకు ఫోన్‌చేసి వేములవాడ మండలం కోనాయిపల్లి ఎల్లమ్మ ఆలయం వద్ద గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఎల్లారెడ్డిపేటలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వెంకటేశ్ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతునికి భార్య సంధ్య, ఇద్దరు కూతుళ్లు నిత్యశ్రీ, నయనశ్రీ ఉన్నారు.

గడ్డిమందు తాగి రైతు మృతి



చిన్న వెంకటేశ్

గొల్లపల్లి: మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి బండారి చిన్న వెంకటేశ్ అనే రైతు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. గ్రామానికి చెందిన వెంకటేశ్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు. వ్యవసాయ చేసుకుని జీవనం సాగిస్తున్నారు. గురువారం ఉదయం గడ్డిమందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

అంగన్‌వాడీ రిటైర్డ్ టీచర్లకు పెన్షన్ ఇవ్వాలి

సిరిసిల్ల: ఉద్యోగ విరమణ పొందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌తోపాటు పెన్షన్ ఇవ్వాలని ఆలిండియా ట్రేడ్ యునియన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు కోరారు. ఈమేరకు జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజంకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ విరమణ తరువాత టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష చొప్పున ఇవ్వాలని గతంలో 25 రోజుల పాటు సమ్మె చేశామని గుర్తు చేశారు. బదిలీ అయిన స్థానాల్లో కొత్త టీచర్లు, ఆయాలను నియమించాలని విన్నవించారు.

నేడు మున్సిపల్ సమావేశం

సిరిసిల్లటౌన్: పురపాలక సంఘం సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల కమిషనర్ దుబ్బాక లావణ్య ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ జిందం కళ అధ్యక్షతన జరుగుతుందన్నారు. అనంతరం ప్రెస్‌మీట్లో కౌన్సిల్ నిర్ణయాలు వెల్లడిస్తామని వివరించారు.

వైభవంగా మాసశివరాత్రి

- 50 వేల మంది భక్తుల రాక
- వీఐపీలతో కిటకిటలాడిన ప్రొటోకాల్ కార్యాలయం
- భారీగా అభిషేకాలు

వేములవాడ: రాజన్నను శుక్రవారం 50వేల మంది భక్తులు దర్శించుకున్నారు. మాసశివరాత్రి పర్వదినం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. 350కిపైగా అభిషేక టికెట్లు విక్రయించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల ద్వారా రూ.60లక్షల ఆదాయం సమకూరింది. రాజన్న ఆలయంలో సామూహిక కార్తీకదీపోత్సవంలో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి వారి ఓపెన్‌స్లాబ్‌లో మహిళలు రంగురంగుల పూలతో వివిధ ఆకృతుల్లో దీపాలు వెలిగించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి.



రాజన్న ఆలయంలో భక్తులు



దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కోడెమొక్కు చెల్లిస్తున్న భక్తులు



భక్తిశ్రద్ధలతో మహాలింగార్చన

వేములవాడ: మాసశివరాత్రి వేడుకలను పురస్కరించుకుని వేములవాడ రాజన్న ఆలయంలో శుక్రవారం రాత్రి మహాలింగార్చన నిర్వహించారు. వేదమూర్తుల మంత్రోచ్ఛరణల మధ్య మహాలింగార్చన వైభవంగా జరిగింది.

రైతు పండుగకు ఆహ్వానం

- రైతు వేదికల్లో సీఎం సభ ప్రత్యక్ష ప్రసారం
- కలెక్టర్ పమేలా సత్పతి



బ్రోచర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: ఈ నెల 30 వ తేదీన(శనివారం) రైతు పండుగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. రైతు పండుగ వేడుకల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబ్ నగర్ జిల్లా నుండి రైతులను ఉద్దేశించి శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రసంగిస్తారని, సదరు కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని 15 రైతు వేదికలలో ప్రత్యక్ష ప్రసార కార్యక్రమము నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైతులందరూ ప్రత్యక్ష ప్రసారం నిర్వహిస్తున్న రైతు వేదికలకు పెద్ద ఎత్తున తరలివచ్చి, సీఎం ప్రసంగాన్ని వీక్షించాలని కోరారు.

డీలర్లే రైతులకు మార్గనిర్దేశకులు

విత్తనాలు, ఎరువుల కోసం వచ్చిన రైతుకు డీలర్లు సలహాలు, సూచనలు ఇవ్వాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. స్థానిక కృషి భవన్‌లో ఇన్‌పుట్ డీలర్లకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై డిప్లొమా కోర్సు శిక్షణ తరగతులను శుక్రవారం ప్రారంభించారు. 40 మంది డీలర్లకు సంవత్సరం పాటు వారానికి ఒకరోజు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి వి.భాగ్యలక్ష్మి, ఆత్మ పీడీ చత్రు నాయక్ పాల్గొన్నారు.

డిఫాల్ట్ క్వారీల్లో పనులు జరగడానికి వీల్లేదు

డిఫాల్ట్ అయిన 67 క్వారీల్లో పనులు జరగడానికి వీల్లేదని, వెంటనే ఆ క్వారీలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. కంకర, గ్రానైట్ తదితర క్వారీల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవహరించాలని, అతిక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో అధికారులు అన్ని రకాలుగా క్వారీలను తనిఖీ చేసి నివేదిక అందించాలని కలెక్టర్ సూచించారు.

రేపటి నుంచి ప్రజాపాలన విజయోత్సవాలు

డిసెంబర్ 1 నుండి 9వరకు జిల్లాలో ప్రజా పాలన, ప్రజా విజయోత్సవాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి ప్రకటించారు. విద్యాశాఖ తరపున విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, వైద్య శాఖ తరపున హెల్త్ క్యాంపులు నిర్వహించనున్నామని తెలిపారు. జిల్లాలో నర్సింగ్ కళాశాల, ట్రాన్స్ జెండర్ క్లినిక్, కళాభారతి ప్రారంభోత్సవాలు చేస్తామని అన్నారు. డిసెంబర్ 9 వరకు అన్ని శాఖల అధికారులు తమ శాఖ పరిధిలో షెడ్యూలు ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు తమ పరిధిలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలను విధిగా సందర్శించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 100 శాతం పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పూర్తయిన సర్వే వివరాలను డేటా ఎంట్రీ చేసుకునేందుకు మండల ప్రత్యేక అధికారులు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక ప్రజావాణి

దివ్యాంగుల కోసం ప్రతి సోమవారం మధ్యాహ్నం ఒకటి నుండి రెండు గంటల వరకు ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు సీట్ల కేటాయింపుపై సంస్థకు లేఖ రాస్తామని పేర్కొన్నారు. దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలకు చేయూతనిస్తామని, ప్రైవేట్ సంస్థల ద్వారా దివ్యాంగులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాల్లోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తామని అన్నారు.

నకిలీ విలేకరుల హల్‌చల్

- వ్యాపారికి బెదిరింపులు, డబ్బు వసూలు
- బాధితుడి ఫిర్యాదుతో ఇద్దరి అరెస్ట్



పోలీసులు అరెస్టు చేసిన నకిలీ విలేకరులు

మెట్‌పల్లిరూరల్: కారులో వెళ్తున్న ఓ వ్యాపారిని అడ్డుకుని, బెదిరింపులకు పాల్పడ్డ ఇద్దరు నకిలీ విలేకరులను అరెస్ట్ చేసినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. మల్లాపూర్ మండలం సాతారం గ్రామానికి చెందిన చౌడారపు వెంకటరమణ మెట్‌పల్లిలో కిరాణ దుకాణం నడిపిస్తున్నాడు. ఈ నెల 24న మెట్‌పల్లి నుంచి తనకారులో కిరాణ సామగ్రి తీసుకెళ్తున్నాడు. వేంపేట శివారులో వెంకటరమణ కారును మెట్‌పల్లికి చెందిన గుండమీది శేఖర్ అడ్డుకున్నాడు. నకిలీ సామగ్రి తరలిస్తున్నావని, పోలీస్ స్టేషన్‌కు వెళ్దామంటూ వ్యాపారిని శేఖర్ తన కారులో ఎక్కించుకున్నాడు. కొద్దిదూరం వెళ్లాక.. శేఖర్ మెట్‌పల్లికి చెందిన రామగిరి కార్తీక్‌కు ఫోన్ చేసి రప్పించాడు. తామిద్దరం విలేకర్లమని రూ.10వేలు ఇస్తేనే వదిలిపెడతామని వెంకటరమణను బెదిరించారు. వ్యాపారి ఫోన్‌పే ద్వారా రూ.4వేలు పంపించుకుని, అక్కడి నుంచి జారుకున్నారు. భయాందోళనకు గురైన వ్యాపారి జరిగిన విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశాడు. మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు నకిలీ విలేకరులిద్దరినీ శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి కారు, బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ప్రజలు, వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తల్లిదండ్రులు గొడవపడుతున్నారని..

- యువకుడి బలవన్మరణం

కోరుట్ల: తల్లిదండ్రులు తరచూ గొడవపడుతున్నారనే మనోవేదనతో కొడుకు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెట్‌పల్లిలో విషాదం నింపింది. మెట్‌పల్లిలోని శాంతినగర్‌లో నివసించే రాకేశ్(20) తల్లిదండ్రులు హన్మంతు-సాయమ్మ. రాకేశ్ తల్లిదండ్రులు తరచూ గొడవపడుతుండే వారు. ఇంట్లో నిత్యం గొడవలు జరుగుతుండడంతో రాకేశ్ మనోవేదనకు గురయ్యాడు. జీవితంపై విరక్తి చెంది, కోరుట్ల శివారు కేసీఆర్ కాలనీ సమీపంలోని చెట్టుకు శుక్రవారం ఉరి వేసుకున్నాడు. యువకుడి ఆత్మహత్యతో వారి స్వస్థలంలో విషాదం నిండింది. రాకేశ్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చలి తీవ్రతకు వృద్ధుడు మృతి

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని పొత్కపల్లికి చెందిన గడ్డం రాయమల్లు(60) చలి తీవ్రతకు గురువారం రాత్రి మృతిచెందాడు. ఘటన స్థలాన్ని పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి సందర్శించారు. మృతదేహాన్ని సుల్తానాబాద్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు అనాథ కావడంతో జీపీ సిబ్బంది, ఎస్సై అంత్యక్రియలు జరిపించారు.

ఠాణా మెట్లెక్కిన వృద్ధురాలు

జగిత్యాలక్రైం: నవమాసాలు కనిపెంచిన తల్లిని డబ్బులు, ఆస్తులు ఇవ్వలేదని, తాము పోషించలేమని కొడుకు మొండికేసిన సంఘటన జగిత్యాలలోని విద్యానగర్‌లో చోటుచేసుకుంది. భూపతి గంగవ్వకు ముగ్గురు కుమారులు. తన వద్ద నున్న కొంత డబ్బు, కొంత బంగారం చిన్న కొడుకుకు ఇచ్చింది. దీంతో మిగతా ఇద్దరు కొడుకులు ప్రాణమున్నంత వరకు తల్లిని చిన్నకొడుకు పోషించేందుకు ఓ ఒప్పందం చేసుకున్నారు. ఏడాది క్రితం చిన్నకొడుకు మృతిచెందడంతో అతని భార్య, కుమారుడు తమకే తిండి లేదంటూ వృద్ధురాలిని వెళ్లగొట్టారు. చేసేదేమీలేక వృద్ధురాలు పట్టణ పోలీసులను ఆశ్రయించగా.. ఇద్దరు కొడుకులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. శనివారం ఇద్దరు కొడుకులతో పాటు, చిన్నకొడుకు భార్య, కొడుకుకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పట్టణ ఎస్సై మన్మధరావు తెలిపారు.

బేషరతుగా విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

జ్యోతినగర్(రామగుండం: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి, దళ కమాండర్ పూనెం రమేశ్‌ను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని, వెంటనే కోర్టులో హాజరుపరచాలని ఆపార్టీ జిల్లా నాయకులు చిలుక శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం ఏరియాలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇల్లందు మండలం ఎల్లాపురం గ్రామంలో అనారోగ్యంతో ఉన్న రమేశ్‌ను పోలీసులు అరెస్టు చేసి నిర్బంధించారని, అరెస్టు విషయాన్ని ప్రకటించక పోవడంతో కుటుంబ సభ్యులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. దశాబ్దాలుగా ఆదివాసీ, పేద ప్రజల పక్షాన పోడు భూముల రక్షణకు పోరాడుతూ, వారికి అండగా రమేశ్ ఉద్యమించడమే నేరమా అని ప్రశ్నించారు. ప్రజల కోసం నిత్యం పోరాడుతున్న రమేశ్‌ను ఎలాంటి చిత్రహింసలకు గురి చేయకుండా, ప్రాణహాని తలపెట్టకుండా తక్షణమే కోర్టులో హాజరుపరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోర్టులో హాజరుపరిచే వరకు జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నాయకులు రాయమల్లు, సుధాకర్, సత్యం, రాధక్క తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కౌలురైతు మృతి

జమ్మికుంట(హుజూరాబాద్): ఆత్మహత్యాయత్నం చేసిన ఓ కౌలు రైతు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఏఎస్సై దామోదర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని పాపక్కపల్లికి చెందిన బోరాల రాజేందర్(30)కు ఎకరం వ్యవసాయ భూమి ఉండగా మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకొని, పత్తి సాగు చేస్తున్నాడు. ఐదేళ్లుగా ఆశించిన దిగుబడి రాలేదు. పంట పెట్టుబడికి రూ.6 లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలంటూ నిత్యం మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో గత శనివారం క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం చనిపోయాడు. మృతుడికి భార్య స్వప్న, ఇద్దరు పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

షార్జా ఎయిర్‌పోర్టులో నంచర్లవాసి అరెస్ట్

- ఉచిత న్యాయసాయం కోసం ముఖ్యమంత్రికి విజ్ఞప్తి



ప్రవాసీ ప్రజావాణిలో దరఖాస్తు అందజేస్తున్న ప్రమీల

జగిత్యాలక్రైం: ఉన్న ఊరులో ఉపాధి లేక గల్ఫ్ వెళ్లి తిరిగి వస్తున్న జిల్లాకు చెందిన యువకుడిని మొబైల్ బిల్లు బకాయి విషయమై షార్జా ఎయిర్‌పోర్టులో పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నంచర్ల గ్రామానికి చెందిన సుంకరి శ్రీధర్ ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. ఈ నెల 17న హైదరాబాద్‌కు వచ్చేందుకు షార్జా ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. ఇమిగ్రేషన్ అధికారులు సిమ్‌కార్డు బిల్లు బకాయి కేసులో అతన్ని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. గల్ఫ్ జైలులో ఉన్న తన కొడుకును విడిపించాలని అతని తల్లి ప్రమీల శుక్రవారం హైదరాబాద్ బేగంపేటలోని మహాత్మ జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లోని ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. శ్రీధర్ పేరుపై ఉన్న పాత ఫోన్ సిమ్‌కార్డును ఎవరో దుర్వినియోగం చేసి 12,800 దినార్లు (రూ.3 లక్షలు) బిల్లు చేశారని, శ్రీధర్ హైదరాబాద్‌కు వస్తుండగా ఈ విషయమై కంపెనీ యజమానుల ఫిర్యాదుతో అక్కడి ఇమిగ్రేషన్ పోలీసులు అరెస్ట్ చేశారని, తన కొడుకును షార్జా జైలు నుంచి విడిపించాలని ప్రమీల వేడుకుంటోంది. ఆమె వెంట కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి, గల్ఫ్ జేఏసీ నాయకులు చెన్నమనేని శ్రీనివాస్‌రావు ఉన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో లారీలో మంటలు



లారీలో మంటలు ఆర్పుతున్న స్థానికులు

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ సమీపంలోని కన్నాల టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా లారీలో మంటలు చెలరేగాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. గోదావరిఖని నుంచి యూరియా బస్తాల లోడ్‌తో కరీంనగర్ వెళుతున్న లారీ కన్నాల టోల్‌ప్లాజా దాటగానే ఇంజిన్ నుంచి పొగలు వచ్చాయి. గమనించిన డ్రైవర్ దేవేందర్ అప్రమత్తమై లారీని రోడ్డుపక్కన నిలిపివేశాడు. పరిస్థితిని గమనిస్తుండగానే క్షణాల్లోనే లారీకి మంటలు అంటుకున్నాయి. వెంటనే స్థానిక కన్నాల లారీ అసోషియేషన్ సభ్యులు, టోల్‌ప్లాజా సిబ్బంది హుటాహుటినా సమీపంలోని బోర్‌బావి మోటార్ ఆన్‌చేసి మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెద్దప్రమాదం తప్పింది. ఈఘటనలో లారీ ముందు క్యాబిన్ భాగం పూర్తిగా కాలిపోయింది. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో బిజీగా ఉండే రహదారిపై ఘటన జరుగగా, ఎలాంటి ప్రమాదం సంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

బాలికను వేధించిన వ్యక్తికి రెండేళ్ల జైలు

జగిత్యాలజోన్: బాలికను వేధించిన కేసులో ఓ వ్యక్తికి రెండేళ్ల జైలు, రూ.2వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, పోక్సో కోర్టు జడ్జి జి.నీలిమ శుక్రవారం తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్.రామకృష్ణారావు వివరాల ప్రకారం.. పెగడపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక తన తల్లితో కలిసి ఇంటి వద్దనే ఉంటోంది. బాలికను అదే గ్రామానికి చెందిన ఏదుల ప్రభాకర్ ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. లేదంటే చంపుతానంటూ బెదిరించాడు. అక్టోబర్ 25, 2020న సదరు బాలిక తన కుటుంబసభ్యులతో కలిసి టీవీ చూస్తుండగా, ఏదుల ప్రభాకర్, తన అన్న ఏదుల రమేశ్ ఇంట్లోకి వచ్చారు. బాలిక కుటుంబసభ్యులను ఏదుల రమేశ్ ఇష్టం వచ్చినట్లు తిట్టాడు. ఏదుల ప్రభాకర్ బాలికను తనతో ఎందుకు మాట్లాడం లేదని కొట్టాడు. సెల్‌ఫోన్ పగులగొట్టారు. ఈ సంఘటనపై బాలిక కుటుంబసభ్యులు పెగడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏదుల ప్రభాకర్, రమేశ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్సై డి.నవత చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు కిరణ్‌కుమార్, బి.రాజు, కేవీ.సాగర్ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో, పరిశీలించిన న్యాయమూర్తి ప్రధాన నిందితుడైన ఏదుల ప్రభాకర్‌కు రెండేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించారు. రమేశ్‌ను నిర్దోషిగా ప్రకటించారు.

చెరుకుతోట దగ్ధం..

రాయికల్: రాయికల్ మండలం ఇటిక్యాలలోని నేమూల్ల స్వామిరెడ్డి, సంకూరి రాజిరెడ్డి, సోమ నారాయణరెడ్డిలకు చెందిన సుమారు 8 ఎకరాల చెరుకు తోట శుక్రవారం కాలిపోయింది. రూ.10 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయారు.

బెదిరింపులకు పాల్పడిన ఇద్దరి అరెస్ట్

మంథని: బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు వసూలు చేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు మంథని సీఐ రాజు శుక్రవారం రాత్రి తెలిపారు. మంథని మండలం గాజులపల్లికి చెందిన కందుల శ్రీనివాస్, రామగిరి మండలం సుందిళ్లకు చెందిన సొతకారి సంపత్ అమ్మాయిలకు డబ్బు ఆశచూపుతూ ఫొటోలు, వీడియోలు తీసి వారికి తెలిసినవారికి పంపిస్తారని పేర్కొన్నారు. కొంత మంది అబ్బాయిలు, అమ్మాయిల ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు తీసుకునే వారని వివరించారు. ఈక్రమంలోనే మంథని మండలం సూరయ్యపల్లికి చెందిన ఆర్ల నాగరాజు వీడియోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెట్టినట్లు పేర్కొన్నారు. రూ.50వేలు డిమాండ్ చేశారని, విషయం ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించారు. చివరికి నాగరాజు రూ.30వేలు చెల్లించాడని తెలిపారు. అనంతరం ఫిర్యాదు చేయడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ వెల్లడించారు. సీఐ వెంట ఎస్ఐ రమేశ్ ఉన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరు మృతి

మెట్‌పల్లిరూరల్: ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మేడిపల్లి శివారులో బైక్ అదుపుతప్పి ఒకరు మృతి చెందారు. మెట్‌పల్లిలోని సాయిరాంకాలనీకి చెందిన ఆరె రమేశ్(39) మేడిపల్లిలో నివసిస్తున్నాడు. పనినిమిత్తం శుక్రవారం మెట్‌పల్లికి వెళ్తుండగా మేడిపల్లి శివారులో బైక్ అదుపుతప్పి, చెట్టుకు ఢీకొని బండరాళ్లపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. మెట్‌పల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య జమున ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తెలిపారు.

అన్నాచెల్లెల్లపై దాడి

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తావద్ద ఓ టిఫిన్ సెంటర్‌లో శుక్రవారం అన్నాచెల్లెల్లపై దాడి జరిగింది. స్థానికుల వివరాలు.. సుభాష్‌నగర్‌కు చెందిన న్యాతరి తేజ, అతడి చెల్లెలు టిఫిన్ చేస్తుండగా కదంబాపూర్‌కు చెందిన 10 మంది యువకులు అకారణంగా దూషిస్తూ, కర్రలతో దాడి చేశారు. ఈఘటనపై న్యాతరి తేజ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.